క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామంలో ఈ నెల 13న సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మూడు విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు రూ. 5 వేల నగదును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు తమిరి శ్రీను, సాంబమూర్తి, బంగారు సురేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో కొత్త మెనూ అమలు చేయాల్సిందే..

మెరకముడిదాం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం రూపొందించిన కొత్త మెనూ అమలు చేయాలని ఎంఈఓ ఎం. రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏయే రోజు ఏయే వంటలు చేయాలో ఇప్పటికే ఆయా పాఠశాలల హెచ్ఎంలకు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

షికారుగంజిలో 'ఫ్యామిలీ డాక్టర్'



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి గ్రామంలో కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంతోషి రూప ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో శిబిరం నిర్వహించి ఓపీ (అవుట్ పేషెంట్) సేవలు అందించారు. 87 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీయడంతో పాటు పలువురికి వైద్య తనిఖీలు చేశారు.

వీఆర్ఓ సస్పెండ్‌పై విచారణ

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి వీఆర్ఓ వి.అప్పలనాయుడు సస్పెండ్‌పై ల్యాండ్స్ అండ్ ఎక్విజేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.వెంకటేశ్వర్లు బుధవారం విచారణ చేపట్టారు. ఇటీవల కొండగంగుబూడి గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీఆర్ఓ అప్పలనాయుడును సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తానని డీసీ తెలిపారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈ శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గజపతినగరం ఆస్పత్రి రోడ్డు, సంతతోట కాలనీ (పురిటిపెంట), ఎం.వెంకటాపురం, దావాలపేట రోడ్డు, కృష్ణారావు ఆస్పత్రి, ఎక్సైజ్ ఆఫీస్ రోడ్డు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

26 నుంచి ఆలయ పునఃప్రతిష్ట ఉత్సవాలు

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో బంగారమ్మతల్లి ఆలయ పునఃప్రతిష్ట ఉత్సవాలను ఈనెల 26వ తేదీ నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బేత శ్రీదేవి,రవి దంపతులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేయించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 28న మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం చేయనున్నామని, గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

కొత్తవలస : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని టీడీపీ మండల అధ్యక్షుడు గొరపల్లి రాము ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బలిగట్టం గ్రామ సమీపంలోని న్యూహోప్ అనాథ ఆశ్రమంలో పిల్లలకు పండ్ల పంపిణీతో పాటు అన్నదానం చేశారు. నాయకులు కోళ్ల శ్రీను, బొబ్బిలి అప్పారావు, కొరుపోలు అప్పారావు, రత్నాజీ, శిక్కాన దేముడు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలో పాటు వల్లంపూడి గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు నియోజకవర్గ టీడీపీ నేత గొంప కృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు గొంప వెంకటరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా తీర్థ మహోత్సవాలు



లక్కవరపుకోట: రేగలో పూజలందుకుంటున్న మరిడిమాంబ



వేపాడ: వీలుపర్తిలో పైడిమాంబ ఆలయం వద్ద భక్తుల రద్దీ



కొత్తవలస: తుమ్మికాపల్లిలో ముత్యమాంబను దర్శించుకుంటున్న భక్తులు



వేపాడ: శింగరాయిలో రేలారే రేలా బృందం నృత్య ప్రదర్శన

వేపాడ: మండలంలోని పాటూరు, శింగరాయి, వీలుపర్తి గ్రామాల్లో పైడితల్లమ్మ, జనార్ధనస్వామి, పైడిమాంబ అమ్మవారి తీర్థమహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొత్తవలస మండలంలో..

కొత్తవలస: మండలంలోని ఉత్తరాపల్లి గ్రామంలో మరిడిమాంబ, తుమ్మికాపల్లి గ్రామంలో ముత్యమాంబ అమ్మవార్ల తీర్థమహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను ఆయా గ్రామాలతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఎల్.కోట మండలంలో..

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామంలో మరిడిమాంబ, రంగరాయపురంలో పరదేశమ్మ అమ్మవార్ల తీర్థం బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు.

ఆధార్ కేంద్రంలో తనిఖీలు



దేశపాత్రునిపాలెం సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ పద్మజ

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో ఎంపీడీఓ వై.పద్మజ బుధవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బందితో మాట్లాడి ఆధార్ సేవలు అందిస్తున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి ప్రస్తుతం అయిదు ఆధార్ కేంద్రాలు మంజూరు కాగా కంటకాపల్లి, దేశపాత్రునిపాలెం సచివాలయాల్లో సేవలు ప్రాంభమయ్యాయని చెప్పారు.ఈ కేంద్రాల్లో 5 ఏళ్ల లోపు చిన్నారులకు సంబంధించిన ఆధార్ సేవలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఆధార్ కార్డులో పేరు, ఇంటి పేర్ల మార్పు, మొబైల్ నంబర్ అనుసంధానం తదితర సేవలకు నామమాత్రపు రుసుం వసూళ్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు. అంతకు ముందు కంటకాపల్లి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

జామి: మండలంలోని కొత్త భీమసింగిలో కొలువైన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు రవికుమారాచార్యుల మంత్రోచ్చారణల నడుమ జరిగిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

26న సామూహిక అక్షరాభ్యాసం

విజయనగరం టౌన్: వసంత పంచమిని పురస్కరించుకుని ఈ నెల 26న ప్రత్యేక పూజలు, సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్లు శారదా సేవా సంఘం, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 3.30 గంటల నుంచి సుప్రభాత సేవ, ఆరాధన, కుంకుమార్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తామన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

వేపాడ: మండలంలోని పాటూరులో కోడిపందాలు ఆడుతున్న ముగ్గురిని బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 500 రూపాయల నగదు, నాలుగు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

13 కేంద్రాలలో పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మోహనరావు

బొబ్బిలి: ఈ నెల 22న జరగనున్న పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షకు బొబ్బిలి పట్టణంలో 9 కేంద్రాలు, మండలంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ, పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష నోడల్ అధికారి మోహనరావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, 13 కేంద్రాలలో 4,228 మంది అభ్యర్థులు పరీక్ష రాయడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు జరుగుతుందని, అభ్యర్థులంతా గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కో ఆర్డినేటర్, పార్వతీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు మాట్లాడుతూ, అభ్యర్థులు హాల్‌టికెట్, బాల్‌పాయింట్ పెన్నుతో పాటు ఆధార్ లేదా ఏదైనా ఐడీ ప్రూఫ్ తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి, తదితరులు

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి

గంట్యాడ: ఆడపిల్లలపైవివక్ష చూపడం తగదని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి వి.లక్ష్మీకుమారి అన్నారు. గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షల నిషేద చట్టం, లింగవివక్షత నిర్మూలనపై మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద బుధవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు ఆమె అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భంలో ఉన్నది ఆడ శిశువు అని తెలిస్తే చాలు గర్భస్రావాలు చేయించుకోవడం విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భ్రూణ హత్యల నిరోధానికి, ఆడపిల్లల సంఖ్య పెంచేందుకు గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షల నిషేద చట్టం -1994ను ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందన్నారు. లింగ నిర్ధారణ చేయమని కోరిన వారిపై, లింగ నిర్ధారణ వివరాలు వెల్లడించిన స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు శీతల్ వర్మ, వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఎర్రన్న, సుబ్బలక్ష్మి, పవన్ అశీష్ తదితరులు పాల్గొన్నారు.

1,800 ఎకరాల్లో మొక్కజొన్న సాగు



శ్రీరంగరాజపురంలో సాగులో ఉన్న మొక్కజొన్న

గజపతినగరం: రబీ సీజన్‌కు సంబంధించి మండలంలో ప్రస్తుతానికి 1,800 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగులో ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో పంట చేతికందుతుండడం, ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో పాటు కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తుండడంతో రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. బోర్లు ఆధారంగా మండలంలోని శ్రీరంగరాజపురం, సీతారామపురం, పిడిశీల, కాలంరాజుపేట తదితర గ్రామాల్లో ఈ పంటను సాగుచేస్తున్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ పంటను ఆశించే తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు

రాజాం: పట్టణంలోని సూర్యదుర్గా కల్యాణ మండపం వద్ద రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా రోడ్డు రవాణా శాఖ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించింది. పెద్దపెద్ద బ్యానర్లతో పాటు స్వచ్ఛతా పక్వాడ - 2023 పేరుతో ఉన్న పోస్టర్లను ఆవిష్కరించి అక్కడున్న వారికి అవగాహన కల్పించారు. ఈ నెల 24వరకూ ఈ వారోత్సవాలు ఉంటాయని, అన్ని ప్రాంతాల్లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామని రోడ్డు రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ వి.సుందర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఎంవీఐలు ఏవీ రమణ, ఎస్.రమేష్, వి.దుర్గాప్రసాద్, అసిస్టెంట్ ఎంవీఐ వి.శ్రావ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేడాడ తిలక్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రబీ వరి నాట్లు



లక్కవరపుకోట సమీపంలో ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న రైతు

- ఎస్.కోట నియోజకవర్గంలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 84 హెక్టార్లు
- సుమారు 17 హెక్టార్లలో ఉబాలు పూర్తి



నిండుకుండలా ఎల్.కోట ధర్మసాగర్ చెరువు

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గం పరిధిలో రబీ సీజన్ వరి ఉబాలు జోరందుకున్నాయి. గతేడాది అక్టోబర్ నెలలో, తర్వాత మధ్య మధ్యలో విస్తారంగా కురిసిన వర్షాల కు నియోజకవర్గంలోని పలుగ్రామాల్లోని సాగునీటి చెరువులు నేటికీ నిండుకుండల్లా ఉన్నాయి. సాగునీటికి డోకాలేక పోవడంతో చెరువుల కింద ఆయకట్టు రైతులతో పాటు మోటార్లు ఆధారంగా సాగుచేసే వారు వరి నాట్లు వేసేందుకు దమ్ములు చేపట్టే పనుల్లో బిజీగా ఉన్నారు. లక్కవరపుకోట మండలంలో రబీ వరి సాధారణ విస్తీర్ణం 42 హెక్టార్లు కాగా, ప్రస్తుతం లక్కవరపుకోట, గేదెలవానిపాలెం, కళ్లేపల్లి, సీతారామపురం, గొల్జాం, వీరభద్రపేట, లింగం పేట గ్రామాల్లో 4 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయి. వేపాడ మండలంలో సాధారణ సాగువిస్తీర్ణం 14 హెక్టార్లు కాగా, ప్రస్తుతానికి కృష్ణరాయుడుపేట, కొండగంగుబూడి గ్రామాల్లో 2 హెక్టార్లులో, కొత్తవలస మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 12 హెక్టార్లు అయితే కంటకాపల్లి, రెల్లి గ్రామాల్లో 5 హెక్టార్లలో వరి ఉబాలు పూర్తయ్యాయి. శృంగవరపుకోట మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 12 హెక్టార్లుకాగా ధర్మవరం, మామిడిపల్లి గ్రామాల్లో 3 హెక్టార్లలో, జామి మండలంలో సాధారణ సాగువిస్తీర్ణం 13 హెక్టార్లు అయితే ప్రస్తుతం 3 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలంగా ఉంటే ఖరీఫ్ సీజన్ కంటే రబీ సీజన్‌లోనే అధిక దిగుబడిలు సాధించవచ్చని కొత్తవలస సబ్ డివిజన్ వ్యవసాయ అధికారి కె.విజయ తెలిపారు. వరినాట్లు వేసుకునే ముందు దమ్ములో ఎకరానికి 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్, వంద కిలోల సూపర్ పాస్ఫేట్ చల్లాలని సూచించారు. అలాగే దమ్ము చేసిన మూడు రోజుల తర్వాత నాట్లు వేస్తే మంచి ప్రయోజనం ఉంటుందని, నారు కుదుర్లు దగ్గరదగ్గరగా ఉండేలా నాట్లు వేయాలన్నారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

తాగునీటి పైపు లైన్‌కు మరమ్మతులు



పైపులైన్ మరమ్మతులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ ఎర్రా రామస్వామి

కొత్తవలస: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో అర్ధన్నపాలెం నుంచి సంతమార్కెట్ సమీపంలోని ఏసీ కాలని, బీసీ హాస్టల్, ఆంజనేయపేట తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్ కొద్దిరోజుల క్రితం పాడయ్యింది. దీంతో మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రారామస్వామి స్పందించి పైపులైనుకు బుధవారం దగ్గరుండి మరమ్మతులు చేయించారు. దాబాల గెడ్డ మదుము వద్ద పైపులైన్ ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి ఆయా ప్రాంతాలకు తాగునీరు నిలిచిపోయింది. మరమ్మతులు చేపట్టి ఆయా ప్రాంతాలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించడంతో ఆయా కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం..

- ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ, సరయు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు

జామి: రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్నదాతకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేయాలన్నారు. ఏఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, ఇప్పటివరకు మండలంలో 10,142 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. త్వరితగతిన కొనుగోళ్లు జరగాలంటే ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించాలని కోరారు. రైతులు గోనెలు, రవాణా ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం అందుకు సంబంధించిన నగదు కూడా చెల్లిస్తుందని చెప్పారు. జనవరి పదో తేదీ వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు జరిపినట్లు తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు శాఖాపరమైన ప్రగతి వివరించారు. వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, ఎంపీడీఓ సతీష్, తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'విశాఖ సంస్కృతి సంక్రాంతి' సంచిక ఆవిష్కరణ



సంచికను ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, విద్యార్థులు

విజయనగరం అర్బన్: గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు 'విశాఖ సంస్కృతి సంక్రాంతి' మాసపత్రిక సంచికను ఆవిష్కరించారు. కళాశాల విద్యార్థులు రూపొందించిన సంచిక ముఖచిత్రంపై ముద్రించిన భారతీయుల కట్టు, బొట్టు ఆకట్టుకుంది. మన సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహిస్తూ తమను భాగస్వామ్యం చేసిన కళాశాల యాజమాన్యానికి విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు.

బ్లాక్‌స్పాట్స్ గుర్తింపు



విజయనగరం-పాలకొండ రహదారి మ్యాప్‌ను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

నెల్లిమర్ల: విజయనగరం - పాలకొండ రహదారిలో ఐదు బ్లాక్ స్పాట్స్ గుర్తించినట్లు విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పథకం మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వీసీఐసీ అభివృద్ధి పథకంలో భాగంగా విజయనగరం - పాలకొండ రహదారిని బుధవారం పరిశీలించారు. నెల్లిమర్ల పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌ను అత్యధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతంగా గుర్తించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, వీసీఐసీ అభివృద్ధి పథకంలో భాగంగా రాష్ట్రంలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. దీని కోసం ప్రత్యేకించి కన్సల్టెన్సీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని విజయనగరం - పాలకొండ రహదారిని ప్రమాదకరమైన రహదారిగా గుర్తించినట్లు తెలిపారు. ఈ రహదారిలో ఐదు ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి, ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వీసీఐసీ అభివృద్ధి పథకంలో భాగంగా విశాఖపట్నం, శ్రీకాళహస్తి - ఏర్పేడు పారిశ్రామికవాడల్లోని 17 వేల ఎకరాల్లో రూ. 2,300 కోట్లతో అన్నిరకాల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు బి. హేమసుందర్, పీకేపీ ప్రసాద్, టి. మధుసూదన్, ప్రకాశ్ బాలచంద్ర, జె .రామస్వామి, భాను, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.